క్లుప్తంగా

గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

హుస్నాబాద్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నవంబరు 13న ప్రారంభమై 16న యాత్ర పూర్తవుతుందని తెలిపారు. పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 చార్జీలు నిర్ణయించామని, బస్‌పాస్ కౌంటర్‌లో టికెట్లు బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ వరకు సమాజంలో 'పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో పోలీసుల పాత్ర' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విజేతలైన ముగ్గురిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భిక్షపతి

హుస్నాబాద్: విద్యార్థులు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి పిలుపునిచ్చారు. కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం 'డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నైనాదేవి, పోలీసు అధికారులు సంపత్, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'బాల వికాస' భరోసా

హుస్నాబాద్: అనాథలైన వృద్ధులకు బాల వికాస సంస్థ అండగా నిలుస్తుందని ఆ సంస్థ ప్రతినిధి రాణి చెప్పారు. పట్టణంలో పలువురు వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు, అలాగే పిల్లలకు నోట్ పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలక్క సహకారం, పలువురు దాతల సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్లు పద్మ, హరీశ్, రాజిరెడ్డి, ఎండీ హుస్సేన్, బాల వికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ అందజేత



తహసీల్దార్‌కు మొక్కను అందజేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి గురువారం ప్రముఖ వ్యాపారవేత్త రంగదాంపల్లికి చెందిన వంగ రాజేశ్వర్ రెడ్డి ఫర్నిచర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేపట్టిన సేవా కార్యక్రమాల్లో బాగంగా తహసీల్దార్ కార్యాలయానికి రూ.25వేల విలువైన కుర్చీలు, ఫ్యాన్లు అందజేశామన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యం కోసం వీటిని సమకూర్చామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఆర్‌ఐ లింగం, జేపీ తండా మాజీ సర్పంచ్ భిక్షపతినాయక్, బీఆర్‌ఎస్‌వీ నాయకులు అనిల్‌కుమార్, రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అవసరం



రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ అభిలాష్

కోహెడ(హుస్నాబాద్): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదర్శ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'సేవ్ ద లైఫ్' ఫౌండేషన్ సహకారంతో గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అభిలాష్ మాట్లాడుతూ.. యువకులు స్వచ్ఛందగా వచ్చి రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. యువత సేవా భావం అలవచ్చుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందితో కలిసి ఆయన రక్తదానం చేశారు. కార్యక్రమంలో యశోద శైలజ, అంజయ్య, సిద్దరామప్ప తదితరులు పాల్గొన్నారు.

'విలీనం' కొలిక్కి వచ్చేనా?

ఇటీవల మంత్రి పొన్నం ప్రకటన
- ముమ్మరంగా సాగుతున్న చర్చ
- ఎదురు చూస్తున్న ప్రజలు



అక్కన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని నాలుగు రెవెన్యూ గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం అంశం కొలిక్కిరానుందా అనే ప్రశ్నకు త్వరలోనే తెరపడనునంది. మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, బొడిగేపల్లి, గౌరవెల్లి, జనగామ, గుబ్బడి, కేశవాపూర్, మంచినీళ్లబండ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలైంది. కానీ అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. అయితే ఇటీవల జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్‌ను విలీనం చేస్తామన్నారు. దీంతో త్వరలోనే విలీనం జరగవచ్చు అని ప్రజల్లో చర్చ మొదలైంది. విలీనం చేస్తామన్న గ్రామాలన్నీ అక్కన్నపేట మండలానికి దూరంగా ఉన్నాయి. రవాణా సౌకర్యాలు సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అక్కన్నపేట మండలంలో కలపడాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వస్తున్నారు.

కొత్తగా ఆరు పంచాయతీలు

మండలంలో 500 మంది జనాభా దాటిన ప్రాంతాలు, తండాలను కలుపుకొని ఆరు కొత్త గ్రామాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో దాస్‌తండా, చౌడుతండా, సరిరాం తండా, అంబనాయక్‌తండా, చౌటకుంటతండా, సేవాలాల్ మహారాజ్ తండాలను జీపీలుగా ఏర్పాటు చేసింది. ఓటరు జాబితాతో పాటు వార్డుల వారీగా విభజించి సిద్ధంగా ఉంచారు.

సమాచారం రాలేదు



మండలంలోని నూతనంగా ఆరు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఓటరు జాబితా, వార్డుల వారీగా సిద్ధంచేసి ఉంచాం. నాలుగు రెవెన్యూ గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం కానున్నట్లు మాకు ఎలాంటి సమాచారం రాలేదు.

– భానోతు జయరాం, ఎంపీడీఓ, అక్కన్నపేట

దళారులకు విక్రయించి మోసపోవద్దు

ఎంపీఓ శ్రీనివాస్

దుబ్బాకటౌన్/దౌల్తాబాద్ (దుబ్బాక)/నంగునూరు(సిద్దిపేట): రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని రాయపోల్ ఎంపీఓ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం కిషన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గొల్లపల్లి, రామారం, రాంసాగర్, అంకిరెడ్డిపల్లి, వడ్డేపల్లి, ఎల్కల్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు రాజేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, కిష్టయ్య, రవీందర్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులున్నారు. అదే విధంగా దౌల్తాబాద్‌తో పాటు మండలంలోని సూరంపల్లి, ముత్యంపేట, ముబారస్‌పూర్, హైమద్ నగర్, మల్లేశంపల్లి, ఎండీ షాపూర్, ఇందూప్రియాల్, గొడుగుపల్లి, కోనాయిపల్లి, ఉప్పరిపల్లి, గువ్వలేగి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎండీ జహీర్, ఏపీఎం ఎస్. యాదగిరి, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్స్ బాల్‌రాజ్, సునీత, నాగరాజు, లక్ష్మణ్, వైకుంఠం, కనకరాజు, మహేశ్, ఏఈఓ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, బాపురాజు, సునంద, శిరీష, బందారులాలు, ఆది వేణు, వీఏఓలు పాల్గొన్నారు. పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ కోరారు. నంగునూరు సిద్దన్నపేట మార్కెట్ యార్డు, ఘణపూర్, అక్కెనపల్లి, నంగునూరు, కొండంరాజ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఆర్‌ఐ లింగం, మాజీ ఎంపీటీసీ తిరుపతి, చక్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏంపీఓ శ్రీనివాస్, ఏపీఎం కిషన్

సీనియర్లు స్నేహ పూర్వకంగా మెలగాలి

- మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఏసీపీ మధు
- ర్యాగింగ్ నిషేధిత చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: జూనియర్ విద్యార్థులతో సీనియర్‌లు స్నేహపూర్వకంగా మెలగాలని మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, ఏసీపీ మధు పిలుపునిచ్చారు. కళాశాలలో గురువారం ర్యాగింగ్ నిషేధిత చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల చదువు, క్రమశిక్షణలో ఆదర్శంగా నిలిచిందని, ఈ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే ర్యాగింగ్ నిషేధిత కమిటీకి తెలపాలని సూచించారు. వైద్య వృత్తిలోకి అడుగుపెట్టబోయే వారు ఉన్నతంగా ఆలోచించాలని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో వసూలు చేయండి



మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

చేర్యాల(సిద్దిపేట): గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి, నల్లా పన్నుల బకాయిలను సకాలంలో వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ అనుమతులు లాంటి వాటిని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి, చేర్యాల ఎంపీడీఓ మహబూబ్‌అలీ, మద్దూరు ఎంపీఈఓ వీరరాజు, కొమురవెల్లి ఎంపీఈఓ శ్రీనివాసవర్మ, మిషన్ భగీరథ డీఈ కృష్ణ పాల్గొన్నారు.

హార్వెస్టర్‌తో అప్రమత్తం



వరికోతను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: హార్వెస్టర్ సహాయంతో వరి కోసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ చెప్పారు. మండలంలోని మందపల్లి గ్రామంలో హార్వెస్టర్‌తో వరి కోతను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి కోసే సమయంలో హార్వెస్టర్‌ను ఏ2 గేర్‌లో తక్కువ వేగంతో నడపాలని, బ్లోయర్ ఎప్పుడూ ఆన్‌చేసి 17ఆర్‌పీఎం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.12వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పంచాయతీ ఏర్పాటుకు పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో నూతనంగా ఏర్పడ్డ రాంసాగర్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి పాఠశాల భవనాన్ని గురువారం ఎంపీడీఓ ప్రవీణ్ పరిశీలించారు. ఆ పాఠశాలలో విధులు నిర్వహించేలా చూడాలని దాచారం కార్యదర్శి సురేశ్‌కు సూచించారు. త్వరలోనే పంచాయతీ భవనం ప్రారంభించి కార్యదర్శి, ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ మంజుల, సూపరింటెండెంట్ అంజయ్య ఉన్నారు.

'రూట్' మార్చాలంటూ ఎంపీకి వినతి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కొండపాక(గజ్వేల్): జాతీయ రహదారి 365బి రూట్ మ్యాప్‌ను మార్చేలా చూడాలని పలు గ్రామాల ప్రజలు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. మండలంలోని మర్పడ్గ, ఖమ్మంపల్లి, తడ్కపల్లి గ్రామాల మీదుగా జాతీయ రహదారి వేళ్ళేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూట్ మ్యాప్‌ను మార్చి తమ సాగు భూములను కాపాడాలని గురువారం ఆయనను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ యాదగిరి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి వల్ల చాలా మంది రైతులు తమ భూములు కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఏనె చెర్వు మధ్యలోంచి రోడ్డు నిర్మాణానికి రూట్ మ్యాప్‌ను తయారు చేశారని దాని వల్ల సాగునీరు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అనాలోచిత నిర్ణయం వల్ల చాలా మంది రైతులు తమ జీవనాధారం కోల్పోవలసి వస్తుందని వాపోయారు. రైతుల విన్నపాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్ళి సర్వే మ్యాప్ మార్చేలా కృషి చేస్తానంటూ ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులు అన్నిరంగాల్లో రాణించాలి

జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజు



బాలరాజును సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నాయీబ్రాహ్మణులు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా ట్రెజరీ అధికారి నాగపురి బాలరాజు పిలుపునిచ్చారు. ఈ నెలలో పదవీవిరమణ చేయనున్న ఆయనకు నాయీబ్రాహ్మణ సేవా సంఘం గురువారం ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు చదువులు, రాజకీయాలు, వ్యాపారాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరేందర్, సతీశ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, కనకయ్య, శ్రీరామ్ బాల్ నరసయ్య, మొలంకల శ్రీనివాస్, శ్రీకాంత్, నాగరాజు, మనోజ్, వెంకటేశం, సోమయ్య, నర్సింహులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిద్దిపేటరూరల్: 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్'లో భాగంగా గత 21నుంచి 23వరకు విశాఖపట్టణంలో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థులు అక్కడి రీజినల్ స్థాయిలో నిర్వహించిన బృందగానం పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. నవంబరు 11నుంచి 14వరకు హైదరాబాద్‌లోని తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

సీఐ సైదా



అధికారులకు సూచనలిస్తున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ సైదా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిమ్మనగూడ, సురభి కళాశాల చౌరస్తా, పాతూరు జంక్షన్, క్యాసారం రింగురోడ్డు వరకు రాజీవ్ రహదారిపై ఉన్న పలు ప్రమాద ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్‌రావు, హెచ్‌కేఆర్ హైవే అథారిటీ ప్రతినిధి వెంకట్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హెచ్‌ఆర్‌కేఆర్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారుల సమన్వయంతో వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా రోడ్లపై గుంతలకు మరమ్మతులు, అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలను తొలగించడం, స్పీడ్ లేజర్ గన్ ద్వారా వేగ నియంత్రణ చేపడతామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు.

అక్రమాలపై మొక్కుబడి విచారణ

బాధ్యులపై చర్యలను కోరుతూ ధర్నా



సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అల్లీపూర్ కో–ఆపరేటివ్ సొసైటీలో నెలకొన్న అక్రమాలపై మొక్కుబడిగా విచారణ జరిపారని, బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకుని, డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అల్లీపూర్ సొసైటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ మాట్లాడుతూ సొసైటీలో జరిగిన అవకతవకలపై రెండేళ్ల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు వారికి నోటీసులు జారీ చేశారని, అయితే సొసైటీ అక్రమాలపై సంబంధిత అధికారులు ఇటీవల మొక్కుబడిగా విచారణ జరిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి రూ.లక్ష అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో జయంత్, గణేశ్, రాజు, ప్రశాంత్, భూపతిరెడ్డి, సంపత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మొద్దు

టూటౌన్ ఎస్‌ఐ రాజేశం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాజేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దౌల్తాబాద్(దుబ్బాక): ఎలాంటి పరిస్థితుల్లోను అపరిచిత వ్యక్తులను నమ్మొద్దని టూటౌన్ ఎస్‌ఐ రాజేశం సూచించారు. జిల్లా కేంద్రంలోని దీక్ష పవిత్ర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్, సిబ్బంది కిషన్, మమత, వీణాకుమారి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో విఫలం

సీపీఎం జిల్లా నేత గోపాలస్వామి

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి విమర్శించారు. గజ్వేల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. చాలా మందికి ప్యాకేజీలు, పరిహారాలు అందక అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని, లేనిపక్షంలో నిర్వాసితుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. శశిధర్, ఎల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ స్కావెంజర్ పోస్టుకు పైరవీలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని నాగారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కావెంజర్ పోస్టుకు పైరవీలు చేస్తున్నారని ఆరోపిస్తు గ్రామస్తులు గురువారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. అమ్మ ఆదర్శ కమిటీ తీర్మానం చేసిన వారిని కాకుండా వేరే వారిని నియమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంఈఓ మనీల ఎంపికను వాయిదా వేశారు.

◆ ఎద్దుల అపహరణ

చేర్యాల(సిద్దిపేట): గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఎద్దులను అపహరించిన ఘటన పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ పి.నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కర్రె లింగం తన రెండు ఎద్దులను బుధవారం రాత్రి వ్యవసాయ బావి వద్ద ఉంచి రోజువారీ లాగానే ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా ఎద్దులు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎద్దుల విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నట్లు తెలిపారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భవించి యేడాది పూర్తయిన సందర్భంగా నవంబరు 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్‌పీ నాయకులు చందు, యాదగిరి, రమేష్, సుధాకర్‌యాదవ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బాలల హక్కులపై అవగాహన

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మహిళ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం బాలల హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు చైల్డ్ రైట్స్, పోక్సో చట్టం, బాల కార్మికులు, చైల్డ్ మ్యారెజ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిరక్షణ కౌన్సిలర్ నర్సింహులు, లక్ష్మణ్, ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు యాదగిరి, రాజిరెడ్డి, భాగ్య, వెన్నెల, జ్యోతి, స్వప్న, రాణి పాల్గొన్నారు.

◆ డిజిటల్ సర్వే ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో వ్యవసాయ విస్తరణాధికారులు డిజిటల్ సర్వే ప్రారంభించారు. రేగొండ, కుందనవానిపల్లితో పాటు పలు గ్రామాల్లో గురువారం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఏఈఓలు శ్రీలత, శేఖర్ మాట్లాడుతూ డిజిటల్ యాప్ సపోర్ట్ చేయడం లేదన్నారు. సాంకేతిక లోపాలు ఏర్పడంతో ఇబ్బందులు పడ్డామని తెలిపారు.

◆ హమాలీ కార్మికులకు దుస్తుల పంపిణీ

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ గ్రామ హమాలీ కార్మికులకు కాంట్రాక్టర్ చిక్కుడు స్వామి గురువారం దుస్తులు పంపిణీ చేశారు. దీపావళి పండుగ సందర్భంగా దుస్తులు అందించడం సంతోషంగా ఉందన్నారు. పేద పిల్లల చదువులకు సహాయం అందజేస్తామని చెప్పారు.

◆ కొడుకు చితికి తలకొరివి పెట్టిన తల్లి

దుబ్బాకటౌన్: కొడుకే జీవితంగా బతికిన తల్లి చివరికి ఆ కొడుక్కి తలకొరివి పెట్టాల్సిన దీన పరిస్థితి ఏర్పడింది. 13వ వార్డుకు చెందిన బెల్లె కనకరాజు(25) కూలీపని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో కనకరాజును చికిత్స కోసం ప్రభుత్వ అస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స మృతి చెందాడు. ఎవరూ లేకపోవడంతో తల్లి రాజవ్వ కొడుకు దహన సంస్కారాలు నిర్వహించింది.

◆ యూనియన్ బ్యాంకు సేవా కేంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ సేవా కేంద్రాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మెనేజర్ రేషన్ ఆనంద్ సూచించారు. గురువారం సేవా కేంద్రాన్ని సందర్శించారు. నిర్వాహకులు నార్ల హాసినీ జనార్దన్, ఖాతాదారులు పాల్గొన్నారు

◆ పాదయాత్రను విజయవంతం చేయండి

చేర్యాల(సిద్దిపేట): జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో 25 నుంచి డిసెంబర్ 1 వరకు చేపడుతున్న మహా పాదయాత్రకు అధిక సంఖ్యలో మాలలు హాజరై జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్ పిలుపునిచ్చారు. డిసెండరు 1న హైదరాబాద్‌లో ముగింపు సభ జరుగుతుందన్నారు.

◆ బీఆర్‌ఎస్‌వీ నూతన కమిటీ నియామకం

సిద్దిపేటఎడ్యుకేషన్: మహిళా డిగ్రీ కళాశాలలో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నూతన కమిటీని గురువారం ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా అంజలి, కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. విద్యార్థి విభాగం నేతలు గుజ్జరాజు, శ్రీకాంత్ భానుచందర్, నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.